సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

ఆదివారం । 17 । నవంబర్ । 2024



పాలస్తీనియన్లకు సంఘీభావంగా నిలుద్దాం

పాలస్తీనా ప్రజలకు అందరూ సంఘీభావంగా నిలవాలని వీక్షణం పత్రిక ఎడిటర్ వేణుగోపాల్ పిలుపునిచ్చారు. - 8లో



ముగిసిన రాష్ట్ర స్థాయి పోటీలు

చక్రాయపేట మండలంలోని బీఆర్ అంబేడ్కర్ గండి గురుకుల పాఠశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న జోన్-4 రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయి. - 8లో

గరిష్టం/కనిష్టం
29.6 /23.8

వాతావరణం

జిల్లాలో శనివారం 23.8 -29.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 0.6 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

18న జాబ్‌మేళా

ప్రొద్దుటూరు కల్చరల్ : ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడ్యాప్, జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 18న స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ అశోక్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. షిర్డీ సాయి ఎలక్ట్రికల్ లిమిటెడ్, అమర్‌రాజ గ్రూప్, ఏఐఎల్ డిక్సన్, నవభారత్ ఫర్టిలైజర్స్, యంగ్ ఇండియా కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్ (మెకానిక్, ఈఈఈ) చదివిన వారు హాజరు కావచ్చన్నారు. 18 నుంచి 30 ఏళ్ల వయసు కలిగిన యువతి, యువకులు అర్హులని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు htt p://naipunyam.ap.gov.in/urerrefirteration లేక ఫోన్ నంబర్: 8886297300లో సంప్రదించాలని వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

వైవీయూ : స్టాటిస్టిక్స్‌లో అందజేసే 'ప్రొఫెసర్ పి.సి.మహలనోబిస్ అంతర్జాతీయ పురస్కారానికి' దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్టెప్ సీఈఓ సి.సాయిగ్రేస్ తెలిపారు. భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో అందించే ఈ పురస్కారానికి అర్హులైన వారు డిసెంబర్ 31లోపు తమ నామినేషన్లు పంపాలని కోరారు. పూర్తి వివరాలకు స్టెప్ కార్యాలయంలో సంప్రదించవచ్చని వివరించారు.

ఎంపీసీఎస్ నివేదికలు సమర్పించాలి

కడప అగ్రికల్చర్ : ఏపీ పరస్పర సహాయక సహకార సంఘం చట్టం 1995 కింద నమోదు చేసుకుని, జిల్లాలోని మెప్మా, డీఆర్‌డీఏ, వెలుగు ఆధ్వర్యంలో ప్రత్యేకంగా నమోదు చేసుకున్న అన్ని ఎంపీసీఎస్ సంఘాలు 2023–24 సంవత్సరానికి తమ సంఘ లావాదేవీలు ఆడిట్ చేయించుకోవాలని జిల్లా సహకార శాఖాధికారి సుభాషిణి తెలిపారు. ఆమోదం పొందిన సంఘం వార్షిక నివేదికలు 30 రోజులలోపు జిల్లా సహకార శాఖాధికారి, జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో సమర్పించాలని ఆమె పేర్కొన్నారు. సమర్పించని సంఘాలపై ఆంధ్రప్రదేశ్ పరస్పర సహాయక సహకార సంఘం చట్టం 1995 సెక్షన్ 38 ప్రకారం నేరం రుజువైతే ఏడాది వరకు జైలు శిక్ష లేక పది వేల జరిమాన లేక రెండూ విధంచవచ్చని వివరించారు.

విద్యార్థి విజ్ఞాన్ మంథన్ శిబిరానికి ఎంపిక



స్నేహారెడ్డి



జాన్ చెరిల్

వైవీయూ : పాఠశాల విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి, శాస్త్రీయ దృక్పథం పెంచడమే ధ్యేయంగా ఎన్‌సీఈఆర్‌టీ సహకారంతో విజ్ఞాన భారతి సంస్థ నిర్వహించిన 'విద్యార్థి విజ్ఞాన్ మంథన్' రాష్ట్ర స్థాయి శిబిరానికి జిల్లాకు చెందిన ముగ్గురు విద్యార్థినులు ఎంపికయ్యారు. 6 నుంచి 8వ తరగతుల జూనియర్ విభాగంలో ప్రొద్దుటూరు పట్టణానికి చెందిన పొట్టారెడ్డిగారి స్నేహారెడ్డి (6వ తరగతి, మున్సిపల్ హైస్కూల్, ప్రొద్దుటూరు) ప్రథమ స్థానం, కడప నగరానికి చెందిన పి.జాన్ చెరిల్ సుబ్బారెడ్డి (6వ తరగతి, నారాయణ ఇంగ్లిషు మీడియం, ఎన్‌జీఓ కాలనీ, కడప) రెండో స్థానంలో నిలిచారు. వీరితోపాటు ప్రొద్దుటూరుకే చెందిన ఖురేషి సుమియా షాకీర్ (8వ తరగతి, తక్వా ఇంగ్లిషు మీడియం స్కూల్, ప్రొద్దుటూరు)లు చక్కగా రాణించి స్టేట్‌లెవల్ క్యాంపునకు ఎంపికయ్యారు. దేశవ్యాప్తంగా నిర్వహించే ఈ పరీక్షలో రాష్ట్రవ్యాప్తంగా ప్రతి తరగతి నుంచి టాప్–20 మంది విద్యార్థులను రాష్ట్రంలో నిర్వహించే స్టేట్ లెవల్ క్యాంప్‌నకు ఎంపిక చేస్తారు.

కీచక ఉపాధ్యాయుడిపై నివేదిక అందజేత

సుండుపల్లె : బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిపై ఎంఈఓలు నివేదిక తయారుచేసి డీఈఓ సుబ్రమణ్యంకు శనివారం అందజేశారు. మండలంలోని బుర్రల దిన్నెపల్లి ఎంపీపీ పాఠశాలలో బాలల దినోత్సవం రోజు ఐదో తరగతి చదువుతున్న గిరిజన విద్యార్థినిపై ఆ పాఠశాల ఉపాధ్యాయుడు నాగముని నాయక్ అసభ్యంగా ప్రవర్తించిన విషయం తెలిసిందే. విద్యార్థిని తండ్రి కూడా ఈ విషయంపై ఎంఈఓకు ఫిర్యాదు చేసిన సంగతి విదితమే. అయితే ఆ టీచర్‌పై ఎంఈఓలు విచారించి ఓ నివేదికను తయారుచేశారు. శనివారం పాఠశాల తనిఖీకి వచ్చిన డీఈఓకు వారు ఆ నివేదికను అందజేశారు. డీఈఓ మాట్లాడుతూ నివేదికను ఉన్నతాధికారులకు అందజేసి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి సమాజానికి మార్గదర్శకంగా ఉండాలని సూచించారు. పదోతరగతి విద్యార్థులను ప్రత్యేక ప్రణాళికతో అత్యుత్తమ ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఫోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆశలు ఆవిరి



- సరిగా మొలకెత్తని సబ్సిడీ శనగ విత్తనాలు
- ఆందోళనలో రైతులు
- మళ్లీ అప్పుల ఊబిలోకి అన్నదాతలు
- పంటను పరిశీలిస్తున్న అధికారులు, శాస్త్రవేత్తలు



శనగపంట సరిగా మొలవలేదని చూపుతున్న రైతు

కడప అగ్రికల్చర్: రబీలో శనగ పంటను సాగు చేసిన అన్నదాతల ఆశలు ఆవిరవుతున్నాయి. ప్రభుత్వం సబ్సిడీతో సరఫరా చేసిన శనగ విత్తనాలు.. సరిగా మొలకెత్తకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. శనగ పంట సాగు చేసి 15 నుంచి 20 రోజులు దాటినా.. కొన్ని చోట్ల 50 శాతం మేర కూడా మొలక రావడం లేదని రైతులు తెలిపారు. మరికొన్ని చోట్ల 70 శాతం మేర మొలక వచ్చినా, అవి చనిపోతున్నాయని వారు పేర్కొన్నారు. సబ్సిడీతో సరఫరా చేసిన విత్తనాలు నాసిరకం కావడంతోనే ఇలా జరుగుతోందని పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పంటను అలాగే ఉంచాలా లేక దున్నేయేలా అనే సందిగ్ధంలో అన్నదాతలు ఉన్నారు. ఎకరా శనగసాగుకు విత్తనాలు, ఎరువులు, కూలీలు, సేద్యం అన్నీ కలిపి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ఖర్చు చేసి విత్తుకున్నారు. కానీ వారి కష్టంతో పాటు ఆశలు అడియాసలవుతున్నాయి. సరిగా మొలకెత్తని పంటను దున్నేసి మళ్లీ విత్తుకుందామంటే.. భూమిలో పదును ఉండదని పలువురు రైతులు తెలిపారు. ముఖ్యంగా జిల్లాలో ఎర్రగుంట్ల, వీఎన్‌పల్లి, వల్లూరు, పెండ్లిమర్రి, కమలాపురం మండలాలోని చాలా గ్రామాల్లో ఈ పరిస్థితి నెలకొందని వారు పేర్కొన్నారు. ఈ విషయమై వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు గ్రామాలకు వెళ్లి సరిగా మొలకెత్తని పంటను పరిశీలిస్తున్నారు. ఎన్నో ఆశలతో సాగు చేసిన రైతులు మళ్లీ అప్పుల ఊబిలోకి నెట్టబడుతుండటంతో ఆందోళన చెందుతున్నారు. కొంత మంది రైతులు చేసేదేమీ లేక పంటను దున్నేసి పెసలు, మినుములు, నువ్వులు విత్తుకునే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలిసింది.

రబీ సాగు లక్ష్యం అల్లంత దూరం : ఈ ఏడాది రబీలో శనగ పంట సాధారణ సాగు లక్ష్యం 82261 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 44258 హెక్టార్లలో సాగైంది. 53 శాతం మేర మాత్రమే సాగయింది. అంటే సగానికి కొద్దిగా ఎక్కువ మాత్రమే సాగైంది. ఇంకా 47 శాతం పైగా సాగు కావాల్సి ఉంది. ఈ శనగ పంట సాగుకు సీజన్ కూడా మరో వారం, పది రోజుల్లో ముగియనుంది. కానీ ఇప్పటికి సాగు లక్ష్యం అనుకున్న మేర కాలేదు. దీంతో రబీ సాగు లక్ష్యం నెరవేరడం కొంత కష్టతరం అయ్యేటట్లు ఉంది. ఏది ఏమైనా ఈ నెలాఖరు వరకు ఇంకా పలువురు రైతులు శనగపంటను సాగు చేసుకునే అవకాశం ఉంది. పైగా ప్రస్తుతం కురుస్తున్న వర్షంతో సాగు మరింత పెరిగే అవకాశం ఉంది. కాకపోతే నెలాఖరుకు సాగు లక్ష్యం చేరుకుంటామని వ్యవసాయ అధికారులు అంచనాల్లో ఉన్నారు. ఇది సాధ్యమయ్యే పనేనా వేచి చూడాల్సిందే.

సబ్సిడీలోనూ కోతే..

రైతుల పంటల సాగుకు సాయంగా నిలిచి ఆదుకోవాల్సిన ప్రభుత్వాలే రైతులపై భారం మోపుతున్నాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అదే బాటలో నడుస్తూ సబ్సిడీలోనూ రైతులపై భారం మోపింది. గత ప్రభుత్వం రబీ రైతులకు 40 శాతం సబ్సిడీతో శనగలను అందిస్తే.. ప్రస్తుత కూటమి ప్రభుత్వం అదే రబీలో శనగ రైతులకు 25 శాతం సబ్సిడీతో అందించింది. అంటే గతేడాది కంటే రూ.15 శాతం సబ్సిడీని తగ్గించి రైతులపై భారం మోపుతోంది. పోనీ రైతులకేమైనా నాణ్యమైన విత్తనాలు ఇచ్చారా అంటే అదీ లేదు. నాణ్యతలేని విత్తనాలను తమకు అంటగట్టారని పలువురు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

▶▶ ఖరీఫ్‌లో అలా.. రబీలో ఇలా..

గత ఖరీఫ్ ఆరంభం జూన్‌లో వర్షం బాగా కురవడంతో చాలా మంది రైతులు ఆరుతడి పంటలైన మినుము, వేరుశనగ, కంది, పత్తి పంటలు సాగు చేశారు. కొన్ని రోజులు పంటలు ఏపుగా వచ్చినా.. ఆ తరువాత వర్షాభావంతో ఎండిపోయాయి. కమలాపురం, వల్లూరు, వీఎన్‌పల్లి, ఎర్రగుంట్ల, వేముల మండలాల్లో 5 వేల ఎకరాలకుపైగా మినుముపంట పూర్తిగా ఎండిపోయింది. రబీ సీజన్‌లోనైనా గట్టెక్కుదామని ఆశించిన రైతులకు నిరాశే ఎదురైంది.

సరిగా మొలచలా..



ఈ ఏడాది లక్ష రూపాయలు ఖర్చు చేసి 7 ఎకరాల్లో శనగ పంట సాగు చేశాను. సాగు చేసి 20 రోజులు దాటింది. ఇప్పటికి 60 శాతం మేర మొలకెత్తింది. ఇంకా పూర్తి స్థాయిలో మొలకెత్తలే. ఈ పంటను ఉంచుకోవాలా లేక దున్నేయాలా అర్థం కాని పరిసిత్థి నెలకొంది.
– లక్కిరెడ్డి రామసుబ్బారెడ్డి, రైతు, ఎర్రగుంట్ల

నాసిరకం విత్తనాల వల్లే..



సబ్సిడీతో అందించిన నాసిరకం విత్తనాల వల్లే మొలక సరిగా రాలేదు. కొన్ని చోట్ల మొలక వచ్చినా మళ్లీ చనిపోతున్నాయి. ఇది విత్తన సమస్యే. నేను 5 ఎకరాలకు సాగు చేశాను. ఇప్పుడేం చేయయాలో అర్థం కావడం లేదు.
– రామసుబ్బారెడ్డి, రైతు, ఎర్రగుంట్ల

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



జిల్లాలోని ఎర్రగుంట్ల, వల్లూరు, కమలాపురం, పెండ్లిమర్రి మండలాల్లోని పలు గ్రామాల్లో సబ్సిడీతో ఇచ్చిన శనగ విత్తనాలు సరిగా మొలవలేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. వారికి పరిహారం అందించాలి.
– దస్తగిరిరెడ్డి, జిల్లా కార్యదర్శి, ఏపీ రైతు సంఘం

మా దృష్టికి వచ్చింది



రబీలో సాగు చేసిన శనగ పంట అక్కడక్కడా సరిగా మొలకెత్తని విషయం మా దృష్టికి వచ్చింది. కొంత ఆలస్యమైనా మొలక వస్తుంది. ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. పంట సరిగా మొలకెత్తని చోటికి శాస్త్రవేత్తలను పంపించి పరిశీలిస్తున్నాం. వారు పరిశీలించి సమస్య ఏమిటో తెలియజేస్తే విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.
– అయితా నాగేశ్వరావు, జిల్లా వ్యవసాయ అధికారి

శబరిమలకు ప్రత్యేక బస్సులు

కడప అర్బన్ : అయ్యప్పస్వామి భక్తుల కోసం ఏపీఎస్ ఆర్టీసీ వైఎస్ఆర్ జిల్లా వారు నవంబర్ నుంచి జనవరి వరకు వివిధ డిపోల నుంచి అధునాతన, నూతన ఆర్టీసీ బస్సులను అద్దె ప్రాతిపదికన శబరిమలకు నడుపుటకు సిద్ధంగా వున్నారు. వివిధ రకాల బస్సులు వాటి అద్దె వివరాలు ఈ క్రింది విధంగా వున్నాయి.

బస్సు రకం	సీట్ల సంఖ్య	కి.మీ అద్దె (రూ.లలో)
అమరావతి ఏ/సీ	48	120
ఇంద్ర ఏ/సీ	40	79
సూపర్ లగ్జరీ	35	57
అల్ట్రా డీలక్స్	39	61
ఎక్స్‌ప్రెస్	49	62
పల్లె వెలుగు	55	52

- సుశిక్షితులు, అనుభవజ్ఞులు, శబరిమలైకు మార్గం తెలిసిన ఆర్టీసీ డ్రైవర్లచే ఈ బస్సులు నడుపవడును. అలాగే 5 రోజుల ప్రయాణానికి గాను బస్సులను అద్దెకు తీసుకున్న అయ్యప్ప భక్తుల గురుస్వాములకు రూ.2 వేలు పారితోషికంగా ఇస్తారు. వంట వారికి, కన్నెస్వాములు/సహాయకులు మొత్తం కలిపి ఏడుగురికి ఉచిత ప్రయాణం కల్పిస్తారు. మరిన్ని వివరాలకు ఈ కింది ఫోన్ నంబర్లలో సంప్రదించగలరు.

కడప డిపో మేనేజర్ – 99592 25774
మైదుకూరు డీఎం – 99592 25781
ప్రొద్దుటూరు డీఎం – 99592 25777
బద్వేల్ డీఎం – 99592 25779
పులివెందుల డీఎం – 99592 25780
జమ్మలమడుగు డీఎం – 99592 25778

సీనియర్ సిటిజన్స్‌కు రాయితీ

60 ఏళ్లు నిండిన వయోవృద్ధులకు ఆర్టీసీ బస్సులలో ప్రయాణానికి టికెట్‌లో 25 శాతం రాయితీ ఇవ్వనున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన వయోవృద్ధులకు కూడా ఏపీఎస్ ఆర్టీసీ బస్సులలో 25 శాతం రాయితీ ఇస్తారు. అందుకు వయసును ధ్రువీకరించే ఆధార్ కార్డు, పాన్ కార్డు, ఓటర్ కార్డు, పాస్‌పోర్టు, రేషన్‌కార్డు, సీనియర్ సిటిజన్ ఐడీ కార్డును తమ వెంట తీసుకురావాలన్నారు. ఈ వివరాలు జిల్లా ప్రజా రవాణా అధికారి సి. గోపాల్‌రెడ్డి తెలియజేశారు.

• ఆధ్యాత్మిక సుగంధం



గంధం సమర్పిస్తున్న పీఠాధిపతి, చిత్రంలో సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా తదితరులు



దర్గా ఆవరణలో భక్తజన సందడి



పీఠంపై ఆశీనులైన మాలంగ్ షా

కడప పెద్ద దర్గా ఉరుసు ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రధాన ఘట్టంగా భావించే గంధోత్సవంతో శనివారం మొదలయ్యాయి. అంతటా ఆధ్యాత్మిక సుగంధ పరిమళాలు వెదజల్లాయి. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తజనంతో దర్గా ఆవరణం కిక్కిరిసింది. అందరి మనసుల నిండా భక్తిభావం నెలకొంది. – కడప కల్చరల్

వాన.. హైరానా

- కొనసాగుతున్న వర్షాలు
- దెబ్బతిన్న పంటలు
- ఆందోళనలో రైతులు



లింగాల మండలం రామన్నూతలపల్లెలో దెబ్బతిన్న అరటి పంట

కడప అగ్రికల్చర్ : నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. దీంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. నాలుగు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండటంతో.. ఆరతడి పంటలకు ముప్పువాటిల్లే ప్రమాదం ఉందని పలువురు రైతులు తెలిపారు. అలాగే చాలా చోట్ల వరి పంట కోత దశకు చేరుకుంది. ఈ దశలో కురుస్తున్న వర్షాలకు వరి పంట నేలకొరిగింది. కొన్ని చోట్ల కింద పడిన వరిపంటకు మొసులు వచ్చే అవకాశం ఉండటంతో.. రైతుల్లో గుబులు పట్టుకుంది. ఇటీవల వచ్చిన తుపానుతో చాలా మంది వరి, ఆరుతడి పంటల రైతులు నష్టపోయారు. ఆ గాయం మానకముందే మళ్లీ ఈ తుపాను వరికి నష్టం చేకూరుస్తుండటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో చాలా మండలాల్లో శనగ, మినుము, పెసలు వంటి ఆరుతడి పంటలు ఇటీవలే సాగు చేసుకున్నారు. ఈ వర్షాలకు భూమిలోపల విత్తనం దెబ్బతినే అవకాశం ఉందని రైతులు పేర్కొంటున్నారు. ముందస్తుగా సాగు చేసిన ఆరుతడి పంటలతోపాటు దీర్ఘకాలిక ఉద్యాన పంటలకు కొంత మేలు జరిగినా.. చాలా మేర నష్టమే అని రైతులు తెలుపుతున్నారు. ఏదిఏమైనా ఇలాంటి ప్రకృతి వైపరీత్యాలతో అన్నదాతలకు ఆందోళన తప్పడం లేదు.

నేలకొరిగిన అరటి

లింగాల : మండలంలోని రామన్నూతలపల్లె గ్రామానికి చెందిన జయచంద్రారెడ్డి అనే రైతు అరటి తోట శుక్రవారం వర్షాలతోపాటు వీచిన ఈదురుగాలులకు నేలకొరిగింది. ఆయన నాలుగు ఎకరాల్లో అరటి పంట సాగు చేశారు. చెట్లు గెలలు వేసి పూత దశలో ఉన్నాయి. అకాల వర్షాల వల్ల పంట పూర్తిగా దెబ్బతిని, దాదాపు రూ.20 లక్షల మేర నష్టం వచ్చినట్లు రైతు వాపోయాడు. అలాగే చిన్న కూడాల గ్రామానికి చెందిన పురుషోత్తంరెడ్డి అనే రైతుకు చెందిన రెండున్నర ఎకరాల అరటి పంట నేలకు వాలింది. దీంతో రూ.15 లక్షలు నష్టం వాటిల్లిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు. చిన్నకూడాల, రామన్నూతలపల్లె గ్రామంలో దెబ్బతిన్న పంటలను శనివారం హెచ్‌ఓ రాఘవేంద్రారెడ్డి పరిశీలించారు. పంట నష్టాలను అంచనా వేసి, ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని ఆయన తెలిపారు.

కూలిన మిద్దె

మైదుకూరు : మైదుకూరులో ఓ వృద్ధురాలికి చెందిన ఇంటి పైకప్పు కూలింది. నంద్యాల రోడ్డులోని అచ్చమ్మకు చెందిన ఇంటి కాంక్రీట్ పైకప్పు వర్షాలకు దెబ్బతిని కూలిపోయింది. ఆ సమయంలో ఆమె ఇంటిలో లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

పులివెందులలో అత్యధికంగా..

పులివెందుల్లో అత్యధికంగా 28 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. లింగాలలో 26.2, మైదుకూరు 25, వల్లూరు 24.2, బద్వేలు 23.6, గోపవరం 23.2, వీఎన్‌పల్లి 22.8, ఒంటిమిట్ట 21.4, అట్లూరు 20.4, కడప 17.8, కమలాపురం 16.2, ఎర్రగుంట్ల 12.6, సిద్దవటం 11.2, సింహాద్రిపురం, పోరుమామిళ్ల, మైలవరం 10.6, జమ్మలమడుగు 10.4, కలసపాడు, చింతకొమ్మదిన్నె 10.2, చాపాడు 9.4, వేముల 9, బి.కోడూరు 8.6, బి.మఠం 7.2, కాశినాయన 7, చెన్నూరు 4.4, రాజుపాళెం, ప్రొద్దుటూరు 4.2, దువ్వూరు 3.8, ముద్దనూరు 2.4, తొండూరు 2.2, పెద్దముడియం 1.4, కొండాపురంలో 0.8 మి.మీ వర్షం కురిసింది.

ట్రిపుల్ ఐటీ.. విద్యలో మేటి

- 2008లో వైఎస్ఆర్ చొరవతో ఉమ్మడి రాష్ట్రంలో మూడు ట్రిపుల్ ఐటీలు ఏర్పాటు
- ప్రతిభ చాటుతున్న ఇడుపులపాయ విద్యార్థులు
- ఉత్తమ ప్యాకేజీతో ప్రముఖ కంపెనీలకు ఎంపిక




క్యాంపస్ ఇంటర్వ్యూలకు ఎంపికైన ట్రిపుల్ ఐటీ విద్యార్థులతో కళాశాల అధికారులు (ఫైల్)

వేంపల్లె : గ్రామీణ ప్రాంతాల నుంచి ట్రిపుల్ ఐటీ మెట్లెక్కిన విద్యార్థులు.. సాంకేతిక విద్యలో రాణిస్తూ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకుంటున్నారు. 2008లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చొరవతో ట్రిపుల్ ఐటీలు ఏర్పాటు అయ్యాయి. పేద కుటుంబాలకు చెందిన వారు ట్రిపుల్ ఐటీలో నాణ్యమైన విద్యను అభ్యసిస్తూ అన్ని అంశాల్లో ప్రతిభ చాటుతున్నారు. జిల్లాలోని ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో నిర్వహించిన క్యాంపస్ ఎంపికల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉద్యోగాలకు ఎంపికయ్యారు. 5 ఎల్‌పీఏ నుంచి 10 ఎల్‌పీఏ ప్యాకేజీతో ప్రముఖ కంపెనీలకు ఎంపిక కావడం విశేషం.

2008లో ఉమ్మడి రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖరరెడ్డి హయాంలో మూడు ట్రిపుల్ ఐటీలు ఏర్పాటు చేశారు. ఒక్కొక్క ట్రిపుల్ ఐటీలో 2000 మంది విద్యార్థులు విద్యను అభ్యసించే విధంగా శ్రీకారం చుట్టారు. పేద విద్యార్థులకు అత్యుత్తమ సాంకేతిక విద్యను అందించడమే లక్ష్యంగా ట్రిపుల్ ఐటీలు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు భోజనం, వసతులు కల్పిస్తున్నారు. ఆరేళ్ల సమీకృత ఇంటిగ్రేటెడ్ కోర్సును అభ్యసిస్తూ.. అన్ని అంశాల్లో ప్రతిభ చాటుతున్నారు. అన్ని విభాగాల్లోని హెచ్‌ఓడీల ద్వారా ప్రాజెక్టులను చేస్తూ ఉత్తమ ఫలితాలు సాధించి ముందుకు వెళ్తున్నారు. ఏటా అత్యుత్తమ ప్యాకేజీలతో జాతీయస్థాయిలో పేరుగాంచిన ప్రముఖ కంపెనీలకు దాదాపు 250 నుంచి 300 వరకు విద్యార్థులు ఎంపికవుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా సీఎస్‌ఈ విభాగం నుంచి నాలుగో సంవత్సరం ఇంజినీరింగ్ విద్యను అభ్యసిస్తూ ఐదు ఎల్‌పీఏ ప్యాకేజీతో పది మంది విద్యార్థులు ఎంపికయ్యారు. జిల్లాలోని ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో నిర్వహించిన క్యాంపస్ ఎంపికల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉద్యోగాలకు ఎంపిక కావడం పట్ల డైరెక్టర్‌తోపాటు అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎంతో సంతోషంగా ఉంది



ట్రిపుల్ ఐటీలో సీఎస్‌ఈ విభాగంలో ఇంజినీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతూ క్యాంపస్‌లో జరిగిన ఇంటర్వ్యూలలో ఉద్యోగానికి ఎంపిక కావడం సంతోషంగా ఉంది. నా తల్లిదండ్రులు కంచర్ల కమల, వరదప్ప నాయుడులు నన్ను ఎంతో ప్రోత్సహించారు.
– ఓ.నవీన్ కుమార్, ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ విద్యార్థి, ఇడుపులపాయ

కష్టపడి చదివించారు



నాది చిత్తూరు జిల్లా జీడి నెల్లూరు. తల్లిదండ్రులు వెంకటలక్ష్మి, సోమ సుందర రెడ్డి వ్యవసాయం చేసుకుంటూ నన్ను ఎంతో కష్టపడి చదివించారు. ట్రిపుల్ ఐటీలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలలో సెలెక్ట్ అయ్యాను.
– బి.సంతోష్, ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ, ఇడుపులపాయ

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో..



నాది చిత్తూరు జిల్లా పుంగనూరు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో సీఎస్‌ఈ ఇంజినీరింగ్ నాలుగో సంవత్సరం చదువుతున్నాను. తల్లిదండ్రులు జు.జ్ఞానవతమ్మ, శ్రీనివాసాచారి కార్పొరేట్ స్కూల్‌లో టీచర్లుగా పని చేస్తున్నారు. అధ్యాపకుల సాయంతో ఏడు ప్రాజెక్టులు పూర్తి చేశాను. ప్రస్తుతం బెంగళూరులో ఎస్‌హెచ్‌ఐపీఎస్‌వై కంపెనీకి ఏడాదికి ఐదు లక్షల ప్యాకేజీతో ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉంది.
– ఓ.లక్ష్మీ సూర్యతేజ, ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ, ఇడుపులపాయ

సాఫ్ట్‌వేర్ రంగాన్ని అభివృద్ధి చేస్తా



భవిష్యత్తులో సాఫ్ట్‌వేర్ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తాను. నాది తిరుపతి జిల్లా వెంకటగిరి. నా తల్లిదండ్రులు గంగయ్య, పార్వతిలు చేనేత కార్మికులు. తమ వృత్తిని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటారు. ఇంటర్న్‌షిప్ ద్వారా స్కిల్స్ డెవలప్‌మెంట్ చేసుకున్నాను. ఏడాదికి ఐదు లక్షల ప్యాకేజీతో ఎస్‌హెచ్‌ఐపీఎస్‌వై కంపెనీకి ఉద్యోగానికి ఎంపికయ్యాను. ఇందులో అధ్యాపకుల ప్రోత్సాహం ఎంతో ఉంది.
– జయంతి, ఆర్‌కేవ్యాలీ ట్రిపుల్ ఐటీ విద్యార్థిని, ఇడుపులపాయ.

క్లుప్తంగా

ట్రాన్స్‌ఫార్మర్లు చోరీ

కొండాపురం : మండల పరిధిలోని పెంజిఅనంతపురం గ్రామానికి చెందిన ఐదుగురు రైతులకు చెందిన విద్యుత్ ట్రాన్స్‌ఫారాలు 11వ తేదీన చోరీకి గురైనట్లు మండల విద్యుత్‌శాఖ సబ్ ఇంజినీరు రామక్రిష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు. శనివారం ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. పెంజిఅనంతపురం గ్రామంలోని నారాయణరెడ్డి, వెంకటనాయణరెడ్డి, కె వెంకటరమణమ్మ బి.రామలింగారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డిలకు చెందిన పొలంలో అమర్చుకున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎయిమ్స్‌లో కడప విద్యార్థి ప్రతిభ


పండ్ల విజయ్‌కృష్ణ

కడప ఎడ్యుకేషన్ : ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ మెడికల్ అండ్ సైన్సు జాతీయస్థాయి పరీక్షలో కడప నగరం శంకరాపురానికి చెందిన ఉపాధ్యాయుడు పండ్ల ఆంజనేయులు, అన్నమయ్య జిల్లా ఎంపిహెచ్ఈఓ సరళ కుమారుడు పండ్ల విజయ్‌కృష్ణ మెడికల్ పీజీ ఎంట్రెన్స్‌లో ప్రతిభ కనబరిచాడు. ఆల్ ఇండియా స్థాయిలో 230 ర్యాంకు సాధించాడు. ఈ విద్యార్థి గతంలో కడప రిమ్స్‌లో ఎంబీబీఎస్ చేసే సమయంలో కూడా గోల్డ్ మెడల్‌ను సాధించాడు. విజయ్‌కృష్ణకు ఆల్ ఇండియా స్థాయిలో ర్యాంకు రావడం పట్ల తల్లితండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : పరువు పోయిందన్న బాధతో యువకుడు విషం తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటన శనివారం మదనపల్లె మండలంలో జరిగింది. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి అవుట్ పోస్ట్ పోలీసులు తెలిపిన ప్రకారం..మదనపల్లె మండలం కొండామర్రిపల్లె పంచాయతీ ఇసుకనూతిపల్లెకు చెందిన మునెప్ప కుమారుడు బి.శ్రీనివాసులు (40) వ్యవసాయ పనులు చేసుకుంటున్నాడు. కురవంకకు చెందిన ఓ మహిళతో శ్రీనివాసులు అక్రమసంబంధం పెట్టుకుని ఆమె వద్ద కొంత నగదు తీసుకున్నాడు. శుక్రవారం రాత్రి మహిళ శ్రీనివాసులు ఇంటివద్దకు వచ్చి రెండునెలలుగా తన ఇంటి వద్దకు రావడం లేదని నిలదీసింది. దీంతో కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వారి ఎదుట తన పరువు పోయిందనే బాధతో శ్రీనివాసులు విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు బాధితుడిని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పాలస్తీనియన్లకు సంఘీభావంగా నిలుద్దాం

- ఒక జాతి హననానికి సాగుతున్న యుద్ధం ఆగాలి
- ఇజ్రాయిల్‌ను ప్రోత్సహిస్తున్న అమెరికా
- కడప సిటిజన్స్ ఫోరం సంఘీభావ సభలో 'వీక్షణం' ఎడిటర్ వేణుగోపాల్


సంఘీభావ సభలో మాట్లాడుతున్న వేణుగోపాల్

కడప సెవెన్ రోడ్స్ : ఇజ్రాయిల్ దురాక్రమణల వల్ల సొంత దేశం అంటూ లేకుండా పోయిన పాలస్తీనా ప్రజలకు అందరూ సంఘీభావంగా నిలవాలని వీక్షణం పత్రిక ఎడిటర్ వేణుగోపాల్ పిలుపునిచ్చారు. కడప సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం జెడ్పీ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన పాలస్తీనా సంఘీభావ సభలో ఆయన మాట్లాడారు. గత 76 సంవత్సరాలుగా పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ దాడులు చేస్తూనే ఉన్నారు. పాలస్తీనా భూభాగాలను ఇచ్చేయాలని ఐక్యరాజ్య సమితి పలుమార్లు తీర్మానాలు చేసినా ఇజ్రాయిల్ ఖాతరు చేయలేదని తెలిపారు. భద్రత మండలిలో ఆ తీర్మానాలను అమెరికా వీటో చేస్తూ వచ్చిందని పేర్కొన్నారు. పాలస్తీనా విమోచన సంస్థ అధిపతి యాసర్ ఆరాఫత్ 1993లో ఓస్లో ఒడంబడిక ఇజ్రాయిల్‌తో కుదర్చుకున్నారని తెలిపారు. ఒకే పాలస్తీనా అనే నినాదం నుంచి ఆయన వెనక్కి తగ్గారన్నారు. ఈ నేపథ్యంలో పాలస్తీనియన్ల ఆకాంక్షల నుంచి హమాస్ సంస్థ ఉద్భవించిదన్నారు. హమాస్, హిజ్‌బుల్లా టెర్రరిస్ట్ సంస్థలు కావని.. అవి ప్రజా పోరాట సంస్థలని చెప్పారు. గాజాలో 2006 ఎన్నికల్లో హమాస్ గెలిచినా ఇజ్రాయిల్ దాడులు ఆగడం లేదన్నారు. గత సంవత్సరం అక్టోబర్ 7న హమాస్ దాడి తర్వాత ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో 44 వేల మంది పాలస్తీనియన్లు మరణించారన్నారు. ఆహారం, వైద్యం, ఇతర నిత్యావసరాలు అందకుండా ఇజ్రాయిల్ దిగ్బంధించడం దారుణమన్నారు. పశ్చిమాసియాలోని ఆయిల్ నిక్షేపాలపై ఆధిపత్యం కోసం అమెరికా ఇజ్రాయిల్‌ను ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఇస్లామిక్ ప్రజలకు వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా అమెరికా దాని మిత్ర దేశాలు, మీడియా దుష్ప్రచారం చేస్తున్నాయని వేణుగోపాల్ ఆరోపించారు. ఇస్లామిక్ ఫోబియా వల్ల నేడు పాలస్తీనాకు మద్దతు కూడగట్టడం చాలా కష్టంగా మారిందన్నారు. ఒక జాతిని అంతం చేయడానికి ఇజ్రాయిల్ జరుపుతున్న యుద్ధాన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని పిలుపు నిచ్చారు. డాక్టర్ రాజా వెంగళ రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో రాయలసీమ కమ్యూనిస్ట్ పార్టీ కార్యదర్శి ఎస్.రవిశంకర్ రెడ్డి, కడప సిటిజన్స్ ఫోరం అధ్యక్షుడు డాక్టర్ ఓబుళరెడ్డి.. సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు చంద్ర, చంద్రశేఖర్ తదితరులు ప్రసంగించారు. అనంతరం ర్యాలీగా వెళ్లి కోటిరెడ్డి సర్కిల్ వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు.

విద్యారంగ పరిరక్షణ కోసం పోరాటాలు


నగరంలో ఏఐఎస్ఎఫ్ నాయకుల ర్యాలీ

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం సమరశీల పోరాటాలను సన్నద్ధం కావాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి పేర్కొన్నారు. శనివారం కడప నగరంలో ఏఐఎస్ఎఫ్ 20వ జిల్లా మహాసభల సందర్భంగా విద్యార్థులతో కలసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాత కలెక్టరేట్ ఎదుట బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొత్తిళ్లలోనే పిడికిలి బిగించి దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్యా విధానం వలన పేదలకు విద్య అందని ద్రాక్ష లాగా తయారవుతుంతోందన్నారు. ఇప్పటికే రేషనలైజేషన్ పేరుతో దేశవ్యాప్తంగా 60 వేల ప్రభుత్వ పాఠశాలలను హైస్కూళ్లలో విలీనం చేశారని, దీనివలన లక్షల మంది విద్యార్థులు విద్యకు దూరమయ్యే ప్రమాదం ఏర్పడిందన్నారు. సుమారుగా 70 వేల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు జీవో 77 వలన పీజీ విద్యకు దూరమవుతున్నారన్నారు. గతంలో యువగళం పాదయాత్రలో నారా లోకేష్ జీఓ నెం 77ను రద్దు చేస్తానని హామీ ఇచ్చారని, ఇచ్చిన మాట మీద నిలబడి విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. సీపీఐ చంద్ర మాట్లాడుతూ జిల్లాలో వైవీయూ, ఆర్కిటెక్ యూనివర్సిటీ, మెడికల్ కళాశాల, ఉన్నత విద్యారంగంలో జరిగే అవినీతి అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కే. శివశంకర్, జి. వలరాజు, న్యాయసభ జిల్లా సహాయ కార్యదర్శి లీలా కృష్ణ, ఉపాధ్యక్షులు చంద్ర తేజ, పీటర్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లభ్యం కాని యువకుడి ఆచూకీ


రబ్బరు బోటు, ట్యూబుల సహాయంతో నదిలో గాలింపు

వల్లూరు : పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరిలో పెన్నానది నీటిలో శుక్రవారం గల్లంతైన యువకుడి ఆచూకీ శనివారం రాత్రి వరకు లభించలేదు. కార్తిక పౌర్ణమిని పురస్కరించుకుని కుటుంబ సభ్యులతో కలిసి పుష్పగిరికి వచ్చిన కడప పట్టణంలోని ఎన్‌జీవో కాలనీకి చెందిన రెడ్డిపల్లె గణేష్ నీటిలో మునుగుతున్న బాలుడిని రక్షించబోయి గల్లంతైన విషయం విదితమే. పోలీసులు, బంధువులు శనివారం ఉదయం నుండి ట్యూబుల సహాయంతో జాలర్ల ద్వారా, రబ్బర్‌బోటు సహాయంతో రెస్క్యూ టీమ్ ద్వారా గాలింపు చర్యలు చేపట్టారు. సంఘటన జరిగిన ప్రదేశం నుంచి నది వెంబడి చెన్నూరు మండల పరిధిలోని కనపర్తి వరకు గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి వరకు ఎలాంటి ఆచూకీ లభించలేదు. దీంతో అతడి ఆచూకీ కోసం బంధువులు ఎదురు చూడక తప్పలేదు.


కేసుల పరిష్కారానికి కృషి చేయాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి

కడప అర్బన్ : జిల్లాలో వచ్చే నెల 14వ తేదీన నిర్వహించనున్న జాతీయలోక్‌అదాలత్‌లో ఎక్కువ కేసులను పరిష్కారమయ్యేలా ప్రతి పోలీసు అధికారి కృషి చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధానన్యాయమూర్తి జి. శ్రీదేవి సూచించారు. శనివారం కడపలోని జిల్లా కోర్టులో జిల్లా ప్రధాన న్యాయమూర్తి చాంబర్‌లో పోలీసు అధికారులతో ముందస్తు జాతీయలోక్ అదాలత్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో రాజీకాదగిన, లోక్ అదాలత్ ద్వారా పరిష్కారమయ్యే కేసులను పరిష్కారమయ్యేదిశగా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కనీసవేతనం రూ.26వేలు చెల్లించాలని ధర్నా



కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా

రాయచోటి అర్బన్ : అంగన్‌వాడీ వర్కర్లు, మినీ వర్కర్లు,హెల్పర్లకు కనీసవేతనం రూ. 26వేలు చెల్లించాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కమిటీ ఆధ్వర్యంలోఅంగన్‌వాడీలు శనివారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పి.శ్రీనివాసులు మాట్లాడుతూ గత ప్రభుత్వం తమ యూనియన్‌తో చేసుకున్న ఒప్పందం ప్రకారం అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్ల జీతాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పాలకులు మారినప్పటికీ ప్రభుత్వాలు చేసుకున్న ఒప్పందాలు మారబోవన్నారు. అంగన్‌వాడీలకు జీతాలు పెంచేందుకు డబ్బులు లేవంటున్న పాలకులు నెలనెలా తమ జీతాలు ఎలా తీసుకుంటున్నారంటూ ప్రశ్నించారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వరి మాట్లాడుతూ మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. 42 రోజుల సమ్మెకాలంలో చేసుకున్న ఒప్పందాలకు జీఓలు, సర్క్యులర్‌లను వెంటనే విడుదల చేయాలంటూ డిమాండ్ చేశారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి


మృతి చెందిన వెంకటరమణ

పుల్లంపేట : కడప–చెన్నై జాతీయ రహదారి అప్పయ్యరాజుపేట వద్ద శనివారం తెల్లవారుజామున పుల్లంపేట గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా.. కల్లూరు వెంకటరమణ (48) నూకనపల్లి గ్రామానికి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పుల్లంపేట ఎస్ఐ మోహన్ కుమార్ గౌడ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో బాలుడు మృతి

వల్లూరు(చింతకొమ్మదిన్నె) : చింతకొమ్మదిన్నె మండల పరిధిలోని రింగ్ రోడ్డు సర్కిల్ సమీపంలో చైతన్య స్కూల్ బయట దుగ్యాల వరమోక్షిత్ (8) విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన సమాచారం మేరకు.. ప్రొద్దుటూరు మండల పరిధిలోని కుమ్మరకొట్టాలు గ్రామానికి చెందిన దుగ్యాల వరకుమార్ అనే వ్యక్తి కడప రింగ్ రోడ్డు సర్కిల్ సమీపంలోని చైతన్య స్కూల్ హాస్టల్ విద్యార్థులకు దుస్తులు ఉతికే కాంట్రాక్టు తీసుకున్నాడు. ఈ క్రమంలో సుమారు నెల రోజుల నుంచి స్కూల్ హాస్టల్ బయట ఉన్న రేకుల షెడ్‌లో కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. అతని కుమారుడు మోక్షిత్ శనివారం సాయంత్రం స్నానం చేయడానికి వేడి నీళ్ల కోసం బకెట్‌లో ఉంచిన ఎలక్ట్రిక్ వాటర్ హీటరును ప్రమాదవశాత్తూ తగిలాడు. దీంతో విద్యుత్ షాక్‌కు గురై స్పృహ కోల్పోయాడు. చికిత్స కోసం కడప పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఈ మేరకు బాలుడి మృదేహాన్ని పోస్టు మార్టం కోసం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా బాలుడు ప్రొద్దుటూరులోని ప్రభుత్వ పాఠశాలలో 2 వ తరగతి చదువుతున్నట్లు తెలిసింది.

19,20 తేదీల్లో జిల్లాలో పీసీసీ అధ్యక్షురాలి పర్యటన

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఈ నెల 19, 20 తేదీల్లో పర్యటిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 19న 12.40 కడప ఎయిర్ పోర్ట్ నుంచి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి చేరుకుంటారన్నారు. సాయంత్రం పెద్ద దర్గాలో ప్రార్థనలు చేసి ఇడుపులపాయకు చేరుకుంటారన్నారు. అనంతరం 20న ఇడుపుల పాయ ఎస్టేట్ నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి చేరుకొని జిల్లా కలెక్టర్‌ను కలిసి మీడియాతో మాట్లాడుతారని తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

సిద్దవటం : వంతాటిపల్లె గ్రామానికి చెందిన వెంకటసుబ్బయ్యశెట్టి అక్రమంగా మద్యం విక్రయిస్తుండటంతో శనివారం అతడిని అరెస్టు చేసి 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సిద్దవటం ఎక్సైజ్ సీఐ రాజశేఖర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని వంతాటిపల్లె గ్రామ సమీపంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు అందిన సమాచారంతో సిబ్బందితో వెళ్లి దాడులు చేసి వెంకటసుబ్బయ్య శెట్టిని అరెస్టు చేశామన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి నిందితుడిని బద్వేలు కోర్టులో హాజరు పరిచామని తెలిపారు. కార్యక్రమంలో కడప ఎక్సైజ్ స్క్వాడ్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ విశ్వనాథ్‌రెడ్డి, ఎస్ఐ అమీర్‌ఖాన్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్ల బ్యాటరీలు చోరీ

బి.కొత్తకోట : పొలానికి సమీపంలో నిలిపివుంచిన ట్రాక్టర్ల బ్యాటరీలను చోరీ చేసిన ఘటన శుక్రవారం రాత్రి మండలంలోని కుమ్మరపల్లి వద్ద జరిగింది. బయ్యప్పగారిపల్లె పంచాయతీ మొగసాలమర్రికి చెందిన రైతు రామ్మోహన్ రెడ్డి పొలం పనులు పూర్తయ్యాక రెండు ట్రాక్టర్లను కుమ్మరపల్లె వద్ద ఆంజనేయస్వామి ఆలయం వద్ద నిలిపి ఉంచారు. ఎప్పుడూ రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో దొంగలు ట్రాక్టర్ల బ్యాటరీలను తొలగించి తీసుకెళ్లారు. వీటి విలువ రూ.16వేలని బాధిత రైతు రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.

సోషల్ మీడియా కార్యకర్తలు అధైర్యపడొద్దు

ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల : సోషల్ మీడియా కార్యకర్తలను కూటమి ప్రభుత్వం వేధించడం అధికమయిందని, కార్యకర్తలు ఎవరూ అధైర్యపడొద్దు.. పార్టీ అండగా నిలుస్తుందని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు అండగా నిలిచేందుకు జిల్లాల వారిగా బృందాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బద్వేలుకు చెందిన 21 వార్డులో ఉన్న పార్టీ నాయకుడు, సోషల్ మీడియా ఆక్టివిస్ట్ బత్తలపల్లె శ్రీనివాసరెడ్డి కుటుంబ సభ్యులను ఇటీవల పోలీసులు వేధించారు. ఈ నేపథ్యంలో గోవిందరెడ్డి అక్రమ నిర్బంధాలు, అరెస్టులపై స్పందించారు. వైఎస్ జగన్ ఆదేశాల మేరకు సోషల్ మీడియా కార్యకర్తలకు న్యాయ సహాయం కల్పించడంతో పాటు, వారికి భరోసా ఇవ్వడం, వారిని పరామర్శించడం, వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంచడం కోసం పార్టీ బృందాలు పని చేస్తాయన్నారు. జిల్లాల్లో పార్టీ నేతలు, సంబంధిత నాయకులు లీగల్‌సెల్ ప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ పార్టీ పని చేస్తుందన్నారు. ఎవ్వరూ భయపడవద్దన్నారు. వారి కుటుంబాలకు పార్టీ అన్నివిధాలుగా అండగా ఉంటుందన్నారు.

రాయలసీమకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ద్రోహం


తహసీల్దార్ గంగయ్యకు వినతి పత్రం ఇస్తున్న రాయలసీమ ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు

ప్రొద్దుటూరు : ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రాయలసీమకు ద్రోహం చేస్తోందని ప్రజా సంఘాల నాయకులు విమర్శించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద రాయలసీమ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. రాయలసీమ ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు మాట్లాడుతూ శ్రీబాగ్ ఒప్పందం మేరకు రాజధాని కాకపోయినా కనీసం హైకోర్టును రాయలసీమలో ఏర్పాటు చేస్తారని సీమ ప్రజలు ఆశించారన్నారు. అదీ జరగకపోగా, ఇప్పటికే ఏర్పాటు కర్నూలులో ఏర్పాటు చేసిన లోకాయుక్త, మానవహక్కుల కమిషన్ కార్యాలయాలను అమరావతికి తరలించాలనే నిర్ణయం చాలా దుర్మార్గమైనదని అన్నారు. అన్ని ప్రాంతాలను సమాన అభివృద్ధికి కృషి చేయాల్సిన ప్రభుత్వం అమరావతి, పోలవరం కేంద్రంగా పని చేయడం శోచనీయమన్నారు. కృష్ణానదితో ఏమాత్రం సంబంధం లేని కేఆర్ఎంబీని విశాఖ నుండి కర్నూలుకు తరలించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి రాష్ట్రంలోనే కడప నగరంలో ఏర్పాటుచేసిన ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు కేంద్ర కార్యాలయం అమరావతికి తరలించడానికి గల కారణాలేమిటో ప్రభుత్వం చెప్పాలని డిమాండ్ చేశారు. పార్టీలకు అతీతంగా ప్రజాప్రతినిధులందరూ సీమ డిమాండ్లకై సంఘటితంగా కృషి చేయాలని కోరారు. అనంతరం తహసీల్దార్ గంగయ్యకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో రాయలసీమ విద్యావంతుల వేదిక ఉమ్మడి కడప జిల్లా కమిటీ కన్వీనర్ మహమూద్, విరసం కార్యవర్గ సభ్యులు వరలక్ష్మి, చైతన్య మహిళా సంఘం జిల్లా కన్వీనర్ పద్మ, దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లయ్య, మహిళా శక్తి కన్వీనర్ వడ్ల లక్ష్మీదేవి, విద్యార్థి శక్తి కన్వీనర్ హరిత, సృజనా సామాజిక వేదిక కన్వీనర్ శ్రీనివాసులరెడ్డి, పీకేఎస్ కన్వీనర్ నాగేంద్ర, విద్యావంతుల వేదిక సభ్యులు జగదీష్, శ్రీను, దర్బార్, ఇస్మాయిల్, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

26న కేంద్రప్రభుత్వ విధానాలపై నిరసన



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగ సుబ్బారెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఈ నెల 26న చేపట్టే నిరసన కార్యక్రమాన్ని జిల్లాలో జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్. నాగసుబ్బారెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసులురెడ్డి మనోహర్ కోరారు. శనివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంపద సృష్టించే కార్మిక వర్గాన్ని, ప్రజలకు తిండిపెట్టే రైతాంగాన్ని విస్మరిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లుకు, పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయన్నారు. గత 10 ఏళ్లలో రూ.రూ. 19.28 లక్షలకోట్లు రుణమాఫీ, పన్ను రాయితీని ప్రోత్సాహాల పేరుతో దోచిపెట్టారని ఆరోపించారు. విశాఖస్టీల్ ప్లాంట్‌తో సహా భారీపరిశ్రమలు, గనులు, సముద్రతీరాన్ని కారుచౌకగా కార్పొరేట్లకు కట్టబెడుతున్నారన్నారు. కార్మికులకు రూ.26 వేల కనీసవేతనాన్ని ఇవ్వడంలేదన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను 4 లేబర్‌కోడ్లుగా కేంద్రం మార్చి బానిసలుగా పనిచేయించాలని కుట్ర చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు సుబ్బారెడ్డి, భాస్కర్, దస్తగిరి రెడ్డి మల్లికార్జున, కెసి.బాదుల్లా, మద్దిలేటి పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగులను ఆదరించాలి

రెండవ అదనపు జిల్లా జడ్జి జీఎస్ సోమేష్‌కుమార్


వికాస్ విహార్ నిర్వాహకులతో మాట్లాడుతున్న జడ్జిలు

ప్రొద్దుటూరు క్రైం : మానసిక దివ్యాంగుల పట్ల ఆదరణ చూపాలని రెండవ అదనపు జిల్లా జడ్జి జీఎస్ సోమేష్‌కుమార్ తెలిపారు. సూపర్‌బజార్ రోడ్డులోని వికాస్ విహార్ దివ్యాంగుల సేవా సమితిని శనివారం జడ్జిలు సందర్శించారు. అక్కడి పిల్లలకు అందుతున్న వసతులను జడ్జీలు పరిశీలించారు. రోజు వారి కార్యక్రమాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిల్లలకు మిఠాయిలను పంపిణీ చేశారు. జడ్జిలందరూ పిల్లలను ప్రేమతో పలకరిస్తూ కొంత సేపు వారితో గడిపారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి సత్యకుమారి, జూనియర్ సివిల్ జడ్జి హారిక, సిబ్బంది పాల్గొన్నారు. కోర్టు ఆవరణంలో స్వచ్ఛభారత్ జడ్జిల ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణంలో శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసరాలు శుభ్రంగా ఉండాలని రెండవ అదనపు జిల్లా జడ్జి జీఎస్ సోమేష్‌కుమార్ తెలిపారు.

ముగిసిన జోన్–4 రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు


విజేతలకు జ్ఞాపికలను అందజేస్తున్న అధికారులు

చక్రాయపేట : మండలంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గండి గురుకుల పాఠశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న జోన్–4 రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు శనివారంతో ముగిశాయి. జోన్–4 పరిధిలోని 21 గురుకుల పాఠశాలలకు (బాలురు) చెందిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఓవరాల్ చాంపియన్ సీనియర్ విభాగంలో చిన్న టేకూరు, జూనియర్ విభాగంలో రామకుప్పం గురుకుల పాఠశాలలు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సురేంద్రబాబు తెలిపారు. జూనియర్స్ విభాగంలో వాలీబాల్‌లో విన్నర్స్‌గా మలుగూరు, రన్నర్స్‌గా రామకుప్పం, హ్యాండ్‌బాల్‌లో విన్నర్స్‌గా కాలసముద్రం, రన్నర్స్‌గా రామకుప్పం, ఖోఖోలో విన్నర్స్‌గా రైల్వేకోడూరు, రన్నర్స్‌గా సి. బెలగల, కబడ్డిలోవిన్నర్స్‌గా సి.బెలగల రన్నర్స్‌గా బి.పప్పూరు నిలిచాయి. అలాగే చెస్‌లో విన్నర్స్‌గా కణేకల్ రన్నర్స్‌గా హిందూపురం, క్యారమ్స్‌లో విన్నర్స్‌గా రైల్వేకోడూరు, రన్నర్స్ గండిక్షేత్రం గురుకుల పాఠశాల విద్యార్థులు నిలిచారని చెప్పారు.

సీనియర్స్ విభాగంలో ..

సీనియర్స్ విభాగంలో వాలీబాల్‌లో విన్నర్స్‌గా రామసముద్రం, రన్నర్స్‌గా చిన్నటేకూరు, హ్యాండ్‌బాల్‌లో విన్నర్స్‌గా గండిక్షేత్రం, రన్నర్స్‌గా రామకుప్పం, ఖోఖోలో విన్నర్స్‌గా చిన్నటేకూరు, రన్నర్స్‌గా బీ.మఠం, కబడ్డీలో విన్నర్స్‌గా కణేకల్, రన్నర్స్‌గా చిన్న టేకూరు, చెస్‌లో విన్నర్స్‌గా రామకుప్పం, రన్నర్స్‌గా రైల్వేకోడూరు, క్యారమ్‌లో విన్నర్స్‌గా బి,మఠం, రన్నర్స్‌గా కాలసముద్రం గురుకుల పాఠశాలల విద్యార్థులు నిలిచారు. విజేతలకు కర్నూలు, చిత్తూరు, అనంతపురం జిల్లాల డీసీవోలు డాక్టర్ ఐ.శ్రీదేవి, పద్మజ, ఉదయశ్రీ, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి తులసిరెడ్డిల చేతుల మీదుగా జ్ఞాపికలను అందజేశారు.

10 ఎర్రచందనం దుంగలు స్వాధీనం


నిందితుల వివరాలను వెల్లడిస్తున్న ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ నయీమ్‌అలీ

బద్వేలు అర్బన్ : కడప–నెల్లూరు జిల్లాల సరిహద్దులోని రామాపురం అటవీప్రాంతంలో అక్రమంగా తరలిచేందుకు సిద్ధంగా ఉన్న 10 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేయడంతో ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు బద్వేలు ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ నయీమ్‌అలీ పేర్కొన్నారు. స్థానిక సిద్దవటం రోడ్డులోని ఫారెస్టు బంగ్లా ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. రామాపురం అటవీప్రాంతంలోని లారీ బాట ప్రాంతంలో ఎర్రచందనం దుంగలు అక్రమ రవాణా చేసేందుకు సిద్ధంగా ఉంచారని రాబడిన సమాచారం మేరకు డీఎఫ్ఓ వినీత్‌కుమార్, సబ్ డీఎఫ్ఓ స్వామివివేకానంద ఆదేశాల మేరకు లారీ బాట ప్రాంతంలో సిబ్బందితో వెళ్ళి దాడులు నిర్వహించారు. నెల్లూరు జిల్లాకు చెందిన నరమాలవెంకటేశ్వర్లు,షేక్‌ఖాజారసూల్, కంభంపాటి సూర్య నారాయణలు దుంగలు తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. స్వాధీనం చేసుకున్న దుంగల విలువ సుమారు రూ.77 వేలు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ దాడుల్లో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కె.వెంకటశేషయ్య, ఎఫ్ఎస్ఓ ఖాజావలి, ఎఫ్‌బీఓలు సువర్ణ కుమార్, రాజేష్‌రెడ్డి, పుష్పరాజు, ఏబీఓలు, ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.